హేమంత తుషారం - 9

విస్మయంతో చూస్తూండిపోయిన హేమంత్‌తో మహాలక్ష్మి మెల్లగా అంది ''నేను చెప్పాలనుకునీ, అనవసరమన్న ఆలోచనతో చెప్పని విషయాలను ఈ సందర్భంలో చెప్పటం అవసరమే! చెబుతాను. వివరంగా అన్నీ చెప్పలేనుగానీ క్లుప్తంగా మీకంతా తెలిసేట్లుగా వివరిస్తాను...''

అతని వేపు చూడకుండా, చూపు మరోవేపు మళ్ళించి మెల్లగా చెప్పటం మొదలు పెట్టింది.

''నా హైస్కూలు చదువు పూర్తయి... కాలేజీలో చేరాలని, చదువు కొనసాగించాలనీ కలలు కంటున్న రోజుల్లో... నాకో పెళ్ళి సంబంధం వచ్చింది. ఒక్కడే కొడుకు.. తండ్రి లేడు. మాకంటే ఎన్నో రెట్లు ఎక్కువున్న ఆస్తిపాస్తులకి వారసుడు... అలాంటి వాళ్ళు మా సంబంధం గురించి ఎందుకు వెతుక్కుంటూ వచ్చారో ఆలోచించుకునే వ్యవధి కూడా లేదు. పిల్ల అదృష్టం అనేది మాత్రమే అందరూ ఏకగ్రీవంగా చెప్పిన మాట.

నాకు చదువుకోవాలనుందని అభ్యంతరం చెప్పాను. మా నాన్న ఆ మాట చెబితే, కొడుకును తీసుకుని పెళ్ళి చూపులకి వచ్చిన... ఆవిడను అత్తగారనాలేమోగానీ... ఇపుడలా అనటం కూడా నాకు ఇష్టంలేదు... అందుకని ఆవిడ అనే చెబుతాను... నా ఇష్టానికి అడ్డేమీ లేదనీ, మా ఊరు నుండి అయినా కాలేజీకి పొరుగూరు వెళ్ళాల్సిందే కాబట్టి, పెళ్ళి అయ్యాక వాళ్ళవూరునుండే వెళ్ళి చదువుకొనసాగించవచ్చని తెలియజేయటంతో, నేనూ ఆనందించాను.

మా కుటుంబ గౌరవం తెలిసి, నా రూపలావణ్యాలు, గుణగణాలు గురించి విని మా సంబంధం కోసం వచ్చామని వాళ్ళు చెప్పిన మాటల్ని మేం నమ్మాం. కట్నకానుకలవసరం లేదని, ఆర్భాటాలూ లేకుండా తొందరలోనే పెళ్ళి చేసెయ్యమని అడిగితే, అది వాళ్ళ సహృదయత, సంస్కారం అని ఆనందించాం కూడా.

అయితే పెళ్ళి అవగానే ఆవిడ పెట్టిన కండిషన్‌కి మావాళ్ళు కళ్ళు తేలేశారు. పెళ్ళయి, ఒక పిల్లాడో, పిల్లో పుట్టేవరకూ అటూ, ఇటూ రాకపోకలు ఉండకూడదట! వాళ్ళత్తగారు అలానే చేసింది కాబట్టి, ఆవిడా, అదే సాంప్రదాయాన్ని పాటిస్తున్నానని చెప్పేసరికి... ఇదెక్కడా వినలేదే అని విస్తుపోవటం తప్ప చేసేదేం లేకపోయింది. గొప్పవాళ్ళతో వియ్యమందితే, వాళ్ళేం చెప్పినా తలొగ్గాల్సిందేననుకుని చింతించి వూరుకున్నారు.

అక్కడికి వెళ్ళాక తెలిసింది... అప్పటికే అతను ఒకమ్మాయితో సంసారం సాగిస్తున్నాడని! ఆ అమ్మాయి గనుక కోడలుగా వస్తే, తన పెత్తనం అనేది ఉండదనే విషయం ఆవిడకు తెలుసు. వాళ్ళ ఆస్తిపాస్తులన్నీ కోర్టు లావాదేవీల్లో ఉన్నాయి. అందువల్ల వాళ్ళింటి బరువు బాధ్యతలన్నీ తమవే అవుతాయని గ్రహించిన ఆవిడ... తన పెత్తనానికి తలొగ్గి కిమ్మనకుండా పడివుండే అమాయకురాలి కోసం వెతికి మా వూరుకి.... చేరిందన్నమాట!

నేనొక్కదాన్నే కాబట్టి మాకున్న కొద్దోగొప్పో ఆస్తిపాస్తులన్నీ ఎలాగూ చెందుతాయనే ఉద్దేశ్యంతో మాత్రమే కట్నాకానుకల ప్రసక్తి తీసుకురాలేదనీ అర్థమైంది.

ప్రతీరోజూ వాళ్ళ లంకత కొంప గురించి, ఏడాది తిరిగే సరికల్లా ఇంటికి చేరే పదిపుట్ల ధాన్యం గురించీ పదే పదే చెప్పుకోవటంతో నాకేం ఇబ్బంది లేదుగానీ... అదే పనిగా కానీ కట్నం లేకుండా వాళ్ళింటి కోడలినైపోయానని దెప్పుతున్నా... ఎలాగో భరించాను. అయితే నా చదువుకు అభ్యంతరం చెప్పినప్పుడు మాత్రం బాగా కృంగిపోయాను.

చదువుకోవాలనే నా కోరికా తీరలేదు. అతనేమో తనకి ఇష్టమైన అమ్మాయితో బాహాటంగానే చెట్టాపట్టా లేసుకుని తిరుగుతూ, నావైపు చూడటానికి కూడా మనసొప్పనట్లుగా ఉంటూంటే... ఆ ఇంటిలో నా ఉనికికి అర్థం లేదనిపించింది!

బయటపడితే, కుటుంబ పరువు పోతుందనే భావనతో, నా ఆశలకు సమాధి కట్టిన ఆ పంజరంలోనే

ఉండిపోవాల్సి వచ్చింది. అందర్నీ బాధ పెట్టటం కంటె, అదేదో నేనొక్కదాన్నే భరించటం మంచిదనే నిర్ణయానికి వచ్చాను. గుడ్డిలో మెల్ల అన్నట్లుగా పుట్టింటి వాళ్ళెవరూ రాకూడదనే నిబంధన ఉండటం వలన నా గురించి మా వాళ్ళెవరికీ తెలిసే అవకాశం లేకుండా పోయింది! అందుకే ఆవిడ ధాష్టీకానికి ఎదురులేదు! నేనయినా ఆవిడ పెత్తనాన్ని లోలోన ఖండిరచటం, ఎదిరించటమేగానీ బయటపడలేదు.

ఆ కాపురం పట్ల నాకేమాత్రం అనురక్తి ఏర్పడలేదు. నా చదువుకు గండిపడటం, మావాళ్ళకు దూరంగా ఉండాల్సిరావటం... ఇవే నన్ను లోలోపల తొలిచేస్తూ ఉండేవి.

ఇంతలో ఇంకొక విచిత్రం జరిగింది.

వాళ్ళ బంధువుల వీలునామా ప్రకారం అతనికి పుట్టే ప్రథమ సంతానానికి ఆస్తి వస్తుందనే విషయం వాళ్ళిద్దరి మాటల్ని బట్టి ఊహించగలిగాను, అప్పటినుండీ నా మీద ప్రేమ చూపించటం మొదలు పెట్టేసరికి... అది మరీ సంకటంగా మారింది! ఇంకొక అమ్మాయని ప్రేమిస్తూ, తల్లి బలవంతంమీదో, ఆస్తిమీద ఆశతోనో నన్ను వివాహం చేసుకున్నందుకు కొంచెం కోపం మాత్రమే అతనిమీద ఉండేది. తెచ్చి పెట్టుకున్న ప్రేమతో దగ్గిర కావటాన్ని అస్సలు భరించలేక ఛీకొట్టినట్లుగా దూరంగానే ఉండిపోయాను

కోర్టు దావాలో అతను సహజీవనం సాగిస్తున్న అమ్మాయి కుటుంబానికే ఆస్తి సంక్రమించినట్లుగా వార్త వచ్చింది. దాంతో మళ్లీ నన్ను వదిలించుకోగలిగితే బావుండుననే ఆలోచన వచ్చిందేమో మరి! వాళ్ళ ప్రవర్తనబట్టి నేను ఊహించిన విషయాలివి.

ఒకరోజు... నేను వాళ్ళ మాట లక్ష్యపెట్టలేదనే ఆరోపణతో మా నాన్నను వచ్చి బుద్ధి చెప్పాల్సిందిగా మా ఇంటికి కబురు పెట్టారు!

వాళ్ళకు ఆ ఆలోచన రావటమే నా శాపవిముక్తికి కారణం అయిందనుకుంటాను!

మానాన్న రాగానే వాళ్ళు నా తప్పుల జాబితా చదివి వినిపించారు. నాకైతే, నేను చెప్పాల్సిన అవసరం లేకుండా, ఆ ఇంట్లో నేననుభవిస్తున్న కష్టాల చిట్టాను వాళ్ళే విప్పి చూపించినట్లుగా అయింది!

నాన్న బతిమాలితే, బెట్టు చూపించి తగవు పెంచి లాభసాటి బేరం ఏదైనా చేయాలని ఆలోచించారేమో నాకైతే తెలియదు గానీ జరిగింది మాత్రం పూర్తిగా వేరే!

నాన్న మారు మాట్లాడకుండా నన్ను వెంటబెట్టుకుని బయలుదేరారు.

ఆ మరునాటికి నన్ను వాళ్ళింటికి తిరిగి తీసుకురాకపోతే, కాపురానికి చెల్లుచీటీ ఇచ్చినట్లేనని హెచ్చరించినా నాన్న లక్ష్యపెట్టలేదు!

ఆ ఇంటినుండి బయటకు అడుగుపెట్టాకనే నాకు అర్థమైంది.... కొన్నాళ్ళు జైలు జీవిం గడిపాక మాత్రమే స్వేచ్ఛా స్వాతంత్రాల విలువ బాగా తెలుస్తుందని!

జరిగిందంతా విన్నాక మా అమ్మ బాధపడిరది. నా కాపురాన్ని ఎలాగైనా చక్కదిద్దాలని తాపత్రయ పడిరది కూడా!

ఆ సమయంలో.... నాన్నమ్మే నాకు అండగా నిలబడిరది. నా ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ జరగకూడదని తీర్మానించింది. దాంతో అమ్మావాళ్ళు మా బంధువులంతా ఏం అనుకుంటారో అనే ఆలోచనకి స్వస్తి చెప్పారు. అలా నాన్నమ్మ సాయంతో, ఈ వూళ్ళో మకాం పెట్టి కాలేజిలో చేరి చదువు కొనసాగించాను. మొదటినుండీ నా చదువు పట్ల శ్రద్ధ చూపించే మా బాబాయ్ కూడా ప్రోత్సహించి సహకారం అందించాడు.

చదువు పూర్తి చేసి ఇలా ఉద్యోగంలో స్థిరపడేవరకూ మాత్రమే కాకుండా ఇప్పటికీ నాన్నమ్మ నా వెంటే ఉంది!

''ఇలా నా జీవితం ఓ మేలు మలుపు తిరగటానికి మా అమ్మానాన్నల అంగీకారం, తోడ్పాటు

ఉన్నాగానీ ముఖ్యకారణం మాత్రం మా నాన్నమ్మే...! నాన్నమ్మకి కష్టం కలిగించే ఏ చిన్నపనైనా చేయను... ఆనందం కలిగించటానికి ఎంతటి కష్టాన్నయినా భరించటానికీ వెనుకాడను!''

చెప్పటం పూర్తి చేసిన మహాలక్ష్మి, నిశ్చేష్టుడై కూర్చున్న హేమంత్ వేపు తలతిప్పి నిదానంగా చూసింది.

మెల్లగా నిట్టూర్చి ''ఇంకొక విషయమూ చెప్పాలి. మీకు తెలిసి వుండక పోవుచ్చుగానీ... నేను ఇప్పటివరకూ చెప్పిన నా కథలో... అతనితో పెళ్ళి కాకుండానే కాపురం చేసిన ఆ అమ్మాయి పేరు... నాగసుందరి!'' అంది.

అతను తృళ్ళిపడి ''ఏమిటీ...?!'' అంటూ అప్రయత్నంగా లేచి నిలబడ్డాడు.

మహాలక్ష్మి కూడా లేచి నిలబడి మెల్లగా చెప్పింది. ''అవును... తనే...! ఆ ఇంటికి ఒకసారి వచ్చినపుడు ఆవిడ గట్టిగా గదమాయిస్తున్నట్లుగా మాట్లాడటం విని లోపలిగది కిటికీ తెరిచి చూశాను. అంతే, ఆ ఒక్కసారే తప్ప మళ్లీ చూడలేదు. నేనావూళ్ళో ఉండగా, నేను ఏ ఒక్కరి ఇంటికీ వెళ్ళిందీ లేదు... ఆవిడ అభీష్టం గ్రహించి కాబోలు, ఇంటికి వచ్చిన వాళ్ళు కూడా నా దగ్గర కూర్చునే వాళ్ళూ కాదు. అందుకే, నాగసుందరికి నేను తెలియదు. మీ ఇంట్లో చూసినపుడు తనెవరో నేను గుర్తుపట్టగలిగాను గానీ, తనకి మాత్రం నేను తెలియదు! ఇదీ విషయం.

నేను మా ఇంటికి వచ్చేసిన కొన్నాళ్ళకి వాళ్ళు విడాకులు ఇస్తున్నట్లుగా కాగితం పంపించటం జరిగింది. ఆ బంధం తెగిపోయిందని నిర్ణయించుకుని నిశ్చింతగా ఉండటానికి అది సరిపోతుందని కొందరి సలహాల వల్ల తెలుసుకుని మావాళ్ళూ మిన్నకుండిపోయారు.

నా ఊహ ప్రకారం... నన్ను వదిలించుకున్నాక, నాగసుందరితో పెళ్ళి మాటలు జరిపి

ఉండొచ్చు. వాళ్ళ ప్రవర్తన గమనించాక వాళ్ళ మనస్తత్వాలను అంచనా వేసిన తను తిరస్కరించటం జరిగి వుంటుందనుకుంటున్నా!

తనకు అబార్షన్ చేయించాలనే కన్నవాళ్ళ ఆలోచనా నచ్చక, బయటకు వచ్చేసిన నాగసుందరి ధైర్యాన్ని, చదువుకుని కన్నకూతురిని పెంచుకుంటూ ఒంటరిగా ఉండిపోవాలనే తన నిర్ణయాన్నీ మెచ్చుకోవలిసిందే!

మీ అమ్మగారి మాటలను బట్టే ఈ విషయాలు తెలిసాయి. జీవితంలో తోడు తప్పనిసరని పెళ్ళికి ఒప్పించాననీ నాతో మీ ఇంటికి వచ్చినరోజే చెప్పారు. నాగసుందరి నడవడిలో, మాటల్లో ఎంతో పరిణతి కనుపించింది! నాగసుందరి గురించి, తన కూతురు గురించి అన్ని విషయాలూ తెలిసి ఆశ్రయం ఇచ్చిన మీ అమ్మగారే తనని కోడలుగా చేసుకోవటం ఎంతో మంచి నిర్ణయమని నాకూ అనిపించింది! మీ మాటల్ని బట్టి మీ ఇష్టాన్నీ గ్రహించి, నాతో అరమరికలు లేకుండా ఈ నిర్ణయం గురించి మాట్లాడారు.

ఇప్పుడు... మీకు... విషయం ఏమిటో అంతా అర్థమైందనుకుంటాను! నా నిర్ణయమూ తెలిసిందిగా!'' మహాలక్ష్మి అతనివేపు సూటిగా చూసింది.

కొంచెం తెప్పరిల్లినట్లుగా అతను ''వస్తాను...'' మెల్లగా గొణిగినట్లుగా అని, విమూఢిడిలా బయటకు అడుగులు వేశాడు.

లోపలనుండి వచ్చిన మీనాక్షమ్మ మనవరాలిని చేతులతో పట్టుకుని ''అమ్మలూ...'' అంది ఆర్ద్రంగా. కంఠం కొంచెంగా వణికింది కూడా.

నీళ్ళు నిండిన ఆవిడ కళ్ళను తుడుస్తూ మహాలక్ష్మి అంది. ''నాన్నమ్మా... ఎందుకనోగానీ,

ఇన్నాళ్ళు గుండెలమీద ఏదో బరువు ఉన్నట్లుగా అనిపించేది! ఇపుడా భారం అంతా దిగిపోయి.... చాలా తేలిగ్గా ఉంది! నా జీవితం నుండి 'హేమంత్' అనే అధ్యాయం పూర్తిగా ముగిసిపోయింది! మన మధ్య ఇక అతని మాటలు వద్దే వద్దు! మునుపటిలా ప్రశాంతంగా ఉందాం! సరేనా...!''

మనవరాలి వేపు తేరిపార చూసిందావిడ. ''ఇంత చిన్న వయసులోనే నీకింత నిబ్బరం ఎలా అలవడిందే....' అనుకుంది మనసులోనే!

* * *

కనకరత్నం పెళ్ళి సందడిగా సంబరంలా జరిగిపోయింది.

పందిరిలోనే కాకుండా నాలుగిళ్ళ గుమ్మాలకీ మామిడాకుల తోరణాలూ, బంతిపూల మాలలూ కట్టారు. వెనక వేపున పెరట్లో గాడి పొయ్యిలు ఏర్పాటు చేశారు. వంటవాళ్ళకి కావల్సినవన్నీ అందిస్తూ, కూరగాయలు తరుగుతూ ఆడవాళ్ళు హడావుడి పడుతూంటే, మగవాళ్ళంతా పైపనులు ఎవరికో పురమాయిస్తూనో, చేస్తూనో కనిపించారు.

రెండురోజులు కాలేజికి సెలవు పెట్టేసి, మహాలక్ష్మి కూడా ఇంట్లోనే ఉండిపోయింది. పెళ్ళితంతు అంతా ఆసక్తిగా గమనించింది.

మగపెళ్ళివారమనే భేషజం చూపించకుండా వాళ్ళూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ తమకూ సమాన బాధ్యత ఉందన్నట్లుగా ప్రవర్తించారు. మర్యాదల గురించి వినిపించే ఎత్తిపొడుపులూ, అలకలూ అసలే లేవు. అంతా ఒక్కటేనన్నట్లుగా సర్దుకుపోతూ సరదాగా ఉండటం మహాలక్ష్మికి బాగా నచ్చింది. మరి... ఆమె చూసిన రెండు మూడు పెళ్ళిళ్ళల్లో... మగపెళ్ళివారికి ఎన్ని విధాలుగా మర్యాదలు చేసినా అసంతృప్తి అన్నది వాళ్ళకి సాధారణమేనని వాళ్ళ ప్రవర్తనను బట్టి నిర్ణయించుకున్నది. కానీ ఈ పెళ్ళితో ఆ అభిప్రాయం మారింది. ఇలాంటి సంస్కారవంతులూ ఉంటారనుకుంటూ ముచ్చటపడిరది కూడా.

ఆ పెళ్ళిలో పెద్దరికంతో ఏవో సలహాలిస్తూ, సందడిగానే తిరుగుతున్నా నాన్నమ్మలో ఏదో దిగులు కనిపిస్తోందని కనిపెట్టింది మహాలక్ష్మి. అయితే దానికి తను చేయగలిగిందేమీ లేదన్నట్లుగా నిట్టూర్చి వూరుకుంది.

* * *

ఆరోజు కాలేజికి బయలుదేరటానికి తలుపుతీసిన మహాలక్ష్మి ఒక క్షణం నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. ఎదురుగా నాగసుందరి నిలబడి ఉంది మరి!

''నేను వస్తున్నట్లుగా మీకు ముందే తెలిసినట్లుందే, తలుపుతీశారూ....'' అంది నవ్వుమొహంతో.

ఏం సమాధానం చెప్పాలో తోచనట్లుగా అలా చూస్తుండిపోయిన మహాలక్ష్మితో చనువుగా ''నన్ను లోపలికి రానివ్వరా ఏంటి...?'' అంది.

తేరుకున్నట్లుగా చిరునవ్వుతో ''రండి...'' అంది మహాలక్ష్మి.

''ముందు నన్ను 'అండీ' అని గౌరవించడం మానెయ్యండి. నేనూ 'అక్క' అని పిలుస్తాను సరేనా...?'' అనడిగింది.

అలాగే అన్నట్లుగా మహాలక్ష్మి తల వూపింది.

లోపలనుండి వచ్చిన మీనాక్షమ్మ ఎవరన్నట్లుగా మనవరాలి వైపు చూసింది. మహాలక్ష్మి పేరు చెప్పగానే ఆవిడా తృళ్ళిపడినట్లుయి ఒక క్షణం బిగుసుకు పోయి, అంతలోనే తేరుకుంది.

''నా పెళ్ళి విషయం ముందుగా మీకు చెప్పి, ఆశీస్సులు తీసుకోమని అత్తమ్మ చెప్పటంతో మీ దగ్గరకు వచ్చానండీ బామ్మగారూ...''

నాగసుందరి మాటలకు ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ కదలిక లేనట్లుగా నిలబడిపోయింది.

నాగసుందరి చిరునవ్వుతో చూస్తూ ''బామ్మా.... ఏమిటలా నిలబడిపోయారూ... నేనూ మీ మనవరాలినేననుకుని దీవించండి...'' అంటూ మీనాక్షమ్మ పాదాలనంటి నమస్కరించింది.

ఆవిడ ఆ అమ్మాయి తలపై చేయి పెట్టి పైకి ఏమీ వినపించకుండా పెదవులు కదిలించింది ఆశీర్వదిస్తున్నట్లుగా.

''పెళ్ళి అంటూ అందర్నీ పిలవటం లేదు. మీలాంటి పెద్దలు ఓ పదిమందికి ఈ కబురు చెప్పి పిలవాలనుకుంటున్నానంతే. ముందుగా మీ ఇంటికే వచ్చాను...'' అంది సుందరి.

మహాలక్ష్మి చిరునవ్వుతో ''అయితే పెళ్ళి పిలుపన్నమాట! మా ఆశీస్సులు నీకెపుడూ ఉంటాయి. సుందరీ... మంచివార్త చెప్పావు. సంతోషం ఒక్క క్షణం కూర్చో....'' అంటూ లోపలికి వెళ్ళి తను కొని తెచ్చుకున్న చీర ఇంట్లో ఉన్నది పట్టుకొచ్చి నాగసుందరి చేతుల్లో పెట్టి ''ముందుగా నేనే నీ అక్కగా ఈ పెళ్ళి కానుక ఇస్తున్నాను...'' అంది.

''అయ్యో.... అక్కా.... ఇవన్నీ ఎందుకూ...? నువ్విలా ఆదరంగా పలుకరిస్తావనే నేను అనుకోలేదు. నువ్వు చక్కగా, ఆత్మీయంగా మాట్లాడటమే నాకు పదివేలు...!''

నాగసుందరి మాటలకు 'అయితే హేమంత్ తను చెప్పినదంతా నాగసుందరికీ చెప్పాడన్నమాట' అనుకుంది.

మహాలక్ష్మి చేతికున్న రిస్ట్ వాచీ వైపు చూస్తుంటే మళ్ళీ తనే అంది ''అక్కా... నువ్వు కాలేజికి బయలుదేరు. నీకోసం గేటు దగ్గర రిక్షా కూడా వచ్చింది. నేను రెండు నిముషాలు కూర్చొని... బామ్మ చేతి కాఫీ తాగి తాపీగా

బయలుదేరుతాను...'' మహాలక్ష్మి దగ్గరకు వచ్చి మెల్లని స్వరంతో ''అక్కా... నా మీద కోపం లేదుగా... క్షమించు...'' అంది.

మహాలక్ష్మి ఆత్మీయంగా తన భుజాలచుట్టూ చేయివేసి ''కోపమా.. అస్సలు లేదు! నిన్ను మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నాను!'' అంటూ బై చెప్పి బయటకు వెళ్ళింది.

మీనాక్షమ్మ కదలిక వచ్చినట్లుగా తేరుకుని ''కూర్చోమ్మా... కాఫీ తెస్తాను...'' అంటూ వంటగదిలోకి వెళ్ళింది.

* * *

సాయంకాలం కాలేజి నుండి ఇంటికి రాగానే మహాలక్ష్మి నాయనమ్మని ఆరాగా అడిగింది. ''అవునూ... నాగసుందరి పెళ్ళి ఎపుడని చెప్పిందీ...?''

''ఏమోనే... నేను తేదీ ఏదో చెప్పిందనుకుంటాగానీ నేనూ పట్టించుకోలేదు... మనమేమైనా వెళ్తామా ఏంటీ...!'' అంది.

కాలేజీలో హేమంత్ ఇంకా ఎవరినీ పెళ్ళి అంటూ పిలవలేదు.... బహుశా ముహూర్తం కాంచెం దూరంలోనే ఉందేమో... అనుకుంది మహాలక్ష్మి.

మనవరాలి వేపు పరిశీలనగా చూస్తూ ''ఏమిటీ ఆలోచిస్తున్నావ్... అది సరేగానీ, నువ్వు ముచ్చటపడి కొనుక్కున్న ఆ ఖరీదైన చీర ఆ పిల్లకి ఎందుకిచ్చేశావే...? ఇంకో రెండు ఉన్నాయిగా, వాటిలో ఒకటి ఇచ్చినా సరిపోయేది!'' అందావిడ.

''నాన్నమ్మా... నన్ను అక్కా అంటూ ఇష్టంగా పిలుస్తున్న అమ్మాయికి పెళ్ళికానుక నామకార్థంగా ఇవ్వటం కాదు, నాకు నచ్చినదే ఇవ్వాలనిపించింది....!''

''అవున్లే...నీకు ఇష్టమైనదీ, ముఖ్యమైనదీ ఇచ్చేసావ్... ఇదెంత...!'' అంటూ నిట్టూర్చింది.

''నాన్నమ్మా...'' అంటూ నిష్ఠూరంగా చూసింది. ''అలా ఎప్పుడూ మాట్లాడకు, నేనేమీ తనకి ధారపోయలేదు. సుందరి తనకు కావలసినవాటిని తన స్వశక్తితోనే సాధించుకోగలిగింది! అది గుర్తుపెట్టుకో...!''

మనవరాలి కంఠస్వరంలోని తీక్షణతకి ఆవిడ ఉలిక్కిపడి విస్మయంగా చూస్తూ ''సరే... సరే... నేనేమీ తనని అనటం లేదులే... ఏదో నా బాధ నాది...!'' మెల్లగా గొణుక్కుంటున్నట్లు అని లోపలకు వెళ్ళిపోయింది.

ఆ మరునాడే కాలేజి నుండి ఇంటికి వచ్చిన మహాలక్ష్మి దుప్పటి కప్పుకుని మంచంమీద పడుకునివున్న మీనాక్షమ్మని ఆదుర్దాగా చూసి ''ఏమిటి నాన్నమ్మ.... ఈ వేళపుడు పడుకున్నావేం... బాగాలేదా...?'' అనడిగింది.

''అవునమ్మా.... ఏమిటో కొంచెం నీరసంగా, దడగా కూడా ఉంది...'' అని జవాబిచ్చింది మూలుగుతున్నట్లుగా.

''అయితే... పద... డాక్టరు దగ్గరికెళ్ళొద్దాం...'' అంది తొందరపెడుతున్నట్లుగా.

''లేచి నెమ్మదిగా కూర్చో... కాఫీ చేసి తీసుకురానా... కొంచెం ఓపిక వస్తుంది....'' అంది.

''అంత కంగారేం లేదే. ఇక్కడ హాస్పిటల్స్‌కి వెళ్ళటం నాకిష్టం ఉండదు. నా శరీరతత్వం మనవూరి ఆచారిగారికే బాగా తెలుసు. ఆయన మందులు వాడటమే మంచిదనిపిస్తోంది. నేను కొన్నాళ్ళు మనవూళ్ళోనే ఉంటా... మరి నీకెలా...?''

''అదేమిటి నాన్నమ్మా... నీ అనారోగ్యం గురించి నేను ఆందోళన పడుతుంటే, నువ్వు నా

ఉద్యోగం గురించి ఆలోచిస్తున్నావా....? కొన్నాళ్ళు సెలవు పెట్టేసి నేనూ నీ వెంటే మనవూరికి వచ్చేసి ఉంటా. వాళ్ళు సెలవు ఇవ్వకపోతే ఉద్యోగం మానెయ్యటానికైనా నేను రెడీనే! నీకంటే నాకేదీ ముఖ్యం కాదు...!''

మీనాక్షమ్మ మొహం పువ్వులా విచ్చుకుంది... ''నిజమా... అయితే కొన్నాళ్ళు మన వూళ్లోనే

ఉందాం. రేపే ఓ రెండు నెలల పాటు సెలవుచీటీ ఇచ్చెయి... కాదంటే, ఇంకోదారి ఉందని నువ్వే చెప్పావుగా, ఈ వేళ.... మన వూరివాళ్ళు వస్తే, నేనిలా అక్కడకు రావాలనుకుంటున్నానని మీ నాన్నకి కబురందించమని చెప్పా. రేపీపాటికి నా ఆలోచన ప్రకారం అయితే మీ అమ్మా, నాన్నా ఇద్దరూ వస్తారు. నెలా, రెండు నెలల తర్వాత వచ్చేట్లయితే, ఈ ఇల్లే ఎందుకూ... ఇంకొకటి చూసుకోవచ్చు. అందుకని... మన సామానెంత ఉందిలే. ఈ కొంచెం సర్దేసుకుని, ఇల్లు ఖాళీ చేసెయ్యటమే మంచిదనిపిస్తోంది.... ఏమంటావ్...?''

నాన్నమ్మ వేపు మహాలక్ష్మి ఆశ్చర్యంగా చూసింది.

ఇదంతా ముందుస్తుగానే ఊహించి పెట్టుకున్నదా... లేక నిజంగా ఇప్పటికిప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలేనా...? ఆమెకు అర్థంకాలేదు.

ఆ మరునాడు మహాలక్ష్మి తల్లీతండ్రీ వచ్చారు.

అప్పటికే చాలా సామాను మీనాక్షమ్మ చకచకా సర్దేసింది.

నాన్నమ్మ హుషారు చూస్తుంటే మహాలక్ష్మికి వింతగా అనిపించింది. ''మనవూరికి వెళ్తున్నందుకేనా నీకింత హుషారు వచ్చేసిందీ... అనారోగ్యం మటుమాయం అయిపోయినట్లుందే...!'' అనడిగింది.

''నేను వెళ్తున్నందుకు కాదే, నువ్వు మనవూళ్ళో కొన్నాళ్ళుఉంటానని ఒప్పుకున్నందుకే నాకింత ఆనందంగా ఉంది! మనవూళ్ళో మనవాళ్ళ మధ్య కొన్నాళ్ళు ఉంటే... నా ఆరోగ్యమే కాదు, నీ మనసూ కుదుటపడుతుందనీ...!''

'నా మనసుకేమైందీ... ఎందుకలా అంటున్నావ్....?'

ఆ మాటలు మహాలక్ష్మి మనసులోనే ఆగిపోయాయి. పైకి రాలేదు. బుకాయించటం ఎందుకూ.. అనుకుంటూ మౌనంగా ఉండిపోయింది.

* * *

సామానంతా బండికి ఎక్కించేశారు.

ఆ కాంపౌండ్‌లోని వాళ్ళంతా చుట్టుముట్టారు. ''మీరెళ్ళిపోతోంటే చాలా దిగులుగా అనిపిస్తోంది. అమ్మా వాళ్ళని వదిలి కాపురానికి ఇక్కడికి వచ్చినపుడు కూడా నాకింత బెంగ కలగలేదు...'' అంటూ కామేశ్వరి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

''అవును... అందరికీ పెద్దదిక్కులా ఉండేవారు... ఈ కాంపౌండ్ కళే పోతున్నట్లుగా ఉంది....'' అని మరొకరూ వంతపాడుతూ అందరూ ఆదరంగా వీడ్కోలు చెప్పారు.

''అపుడపుడూ వచ్చి వెళ్తూనే ఉంటాం. మీరంతా కూడా ఒకసారి మా ఊరికి తప్పకుండా రావాలి...'' అంటూ మీనాక్షమ్మ అందరివైపూ ఆత్మీయంగా చూసింది.

''తప్పకుండా వస్తాం...!'' ముక్తకంఠంతో ఆనందంగా అన్నారందరూ.

ఊరికి రాగానే చుట్టుపక్కల వాళ్ళనీ, బంధువులనీ పలుకరిస్తూనూ సందడిగా రెండు రోజులు గడిచిపోయాయి.

మూడోరోజు ఆచారిగారు వచ్చి మీనాక్షమ్మని పరీక్షించి చూశారు.

''నాన్నమ్మగారికి ఏ అనారోగ్యం లేదమ్మా.. అంతా బాగానే ఉంది...'' అని బలానికి అంటూ ఏవో టానిక్కులు ఇచ్చారు.

''ఇక్కడికి వచ్చాకనే.... కాదండీ... మనవూరికి వచ్చేస్తున్నామనే నిర్ణయానికి రాగానే నాన్నమ్మకి సగం బాగయిపోయినట్లుగా హుషారు వచ్చేసింది! ఇక చెప్పేదేముందీ, వూళ్ళోకి అడుగు పెట్టగానే ఎంత చురుకుదనం వచ్చేసిందో....!''

మహాలక్ష్మి మాటలకు ఆయనా చిన్నగా నవ్వారు. ''స్వంతవూరి గాలి, నీరూ సగం వైద్యం చేసేశాయన్నమాట! ఇక మనవరాలి పెళ్ళి కబురు చెవిని పడిరదంటే, ఓ పదేళ్ళ వయసయినా తగ్గిపోదూ...?''

మహాలక్ష్మికి చిరాగ్గా అనిపించినా, అణచుకుని చిరునవ్వుతో చూసింది.

ఏమిటో... ఎవరికైనా సరే, తనని చూడగానే పెళ్ళి విషయమే గుర్తుకువస్తుందా అని లోలోన విసుక్కుంది.

ఆమె మనసులో మాట పసిగట్టినట్లుగా ఆయనే మళ్ళీ అన్నాడు.''అమ్మాయ్... పెళ్ళే జీవిత పరమార్థమా అని అడగవచ్చుగానీ... పెళ్ళి కూడా జీవితంలో ముఖ్యమైనదే నమ్మా.... ఇదెవరూ కాదనలేం! ఒక్కోవయసులో ఒక్కొక్కరి తోడుతోనే జీవితం సవ్యంగా సాగుతుందని మాలాంటి పెద్దవాళ్ళం అనుకుంటాం. అందుకే మీ నాన్నమ్మగారూ నీ పెళ్ళి చూడాలనే తహతహలాడుతున్నారనిపిస్తోంది....!''

మహాలక్ష్మి అవును ` నిజమే నన్నట్లుగా చిరునవ్వుతో తలవూపింది.

* * *

''అమ్మలూ... ఈ రోజే నాగసుందరి పెళ్ళి. నిన్ననే వసుంధర గుర్తు చేస్తూ తప్పక రావాలని చెప్పారు. మీ నాన్నకి చెబితే, అద్దెకారు తెప్పించాడు. త్వరగా బయలుదేరు...'' మీనాక్షమ్మ మాటలకు మహాలక్ష్మి కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ''ఏమిటీ... మనం పెళ్ళికి వెళ్ళాలా...? వెళ్ళాల్సిన అవసరం లేదనుకున్నాంగా...?''

''నిజమేనే... నిన్న ఆవిడ కబురు పంపించారని నీకు చెప్పటం మర్చిపోయాలే, మీ నాన్నకి మాత్రమే చెప్పినట్లున్నాను. సరేలే, ఏమయితేనేం... నీ తరుపున ఇద్దరం వస్తామని నేనే మాటిచ్చేశాననుకో. నాకోసం, నీ కిష్టం లేని పని అయినా చేస్తానంటావుగా...?''

''అవునవును... నువ్వూ చెప్తూంటావుగా, నచ్చచెప్పటానికి ప్రయత్నించటమే తప్ప నా మనసుకు నొప్పి కలిగించే పని ఏదీ పురమాయించనని! దానికేమంటావ్!''

''ఇప్పుడూ.. అదే మాటనాది! పద, వెళ్ళొచ్చేద్దాం.... వస్తామని చెప్పి రాకపోతే, వాళ్ళు వేరేగా అనుకుంటారు!''

''నా సంగతి మాత్రం అనవసరం.. వాళ్ళేదో అనుకుంటారట...!'' మనసులోనే విసుక్కుంటూ అయిష్టంగా లేచి తయారైంది మహాలక్ష్మి.

దారిలో మీనాక్షమ్మ ఉత్సాహంగా ''అమ్మలూ... ఇంత తొందరలోనే మనం మళ్ళీ ఈ ఊరుకి వస్తామనుకోలేదు కదూ...!'' అంది.

మహాలక్ష్మి నిరాసక్తంగా తలవూపి వూరుకుంది.

కారు వెళ్తోన్న దారి చూసి మహాలక్ష్మి ''ఇదేమిటి.... ఇలా వెళ్తున్నాం... హేమంత్ వాళ్ళిల్లు ఇటేగా...'' అంది... కొంచెం కంగారుగా.

''డ్రైవరు దగ్గర అడ్రసు కాగితం ఉంది. సరిగ్గానే తీసుకెళ్తాడులే. మనం వెళ్తున్నది వాళ్ళింటికే. రిజిస్ట్రారు ఆఫీసులో సంతకాలతో పెళ్ళి పదిగంటలకే అయిపోతుంది. మనల్ని వాళ్ళింటికే రమ్మన్నారు. భోజనాలు చేసి వచ్చేద్దాం...!'' బదులు చెప్పింది మీనాక్షమ్మ.

తనకు తెలియకుండానే చాలా ఆలోచనలు చేసేస్తోందేమిటీ నాన్నమ్మ.... మనసులోనే ఆశ్చర్యపోయింది మహాలక్ష్మి.

హేమంత్ వాళ్ళ ఇంటిముందు కారు ఆగగానే గేటుదగ్గరకు ఎదురొచ్చిన నాగసుందరి ''అక్కా...'' అంటూ ఆనందంగా మహాలక్ష్మి చేయి పట్టుకుంది. మీనాక్షమ్మతో ''ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు బామ్మా.... అక్కనీ తీసుకు వచ్చారు...'' అంది.

లోపలకి అడుగువేసిన మహాలక్ష్మి గుమ్మం దగ్గరగా నిలబడిన హేమంత్ వైపు నిర్లిప్తంగా చూసింది.